క్లుప్తంగా

రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటన విజయవంతం చేయండి

పీలేరురూరల్ : ఈ నెల 21న చిత్తూరులో చేపట్టనున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ అన్నారు. శుక్రవారం పీలేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేశారు. జనాభా ధామాసా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్‌మిశ్రా కమీషన్ వేసిందని తెలిపారు. ఈ నెల 21 చిత్తూరులో కమిషన్ పర్యటన ఉందని, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ నాయకులు నాయకులు చిన్న, రవీంద్ర, గండికోట వెంకటేష్, వెంకటరమణ, చరణ్‌కుమార్, వీహెచ్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నర్సింగ్ సిబ్బంది వినతి

మదనపల్లె : న్యాయం చేయాలని కోరుతూ మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.కోటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం రోజున ప్రభుత్వం ఏపీ వైద్యవిధానపరిషత్‌లోని డీఎంఈ విభాగంలో ఉన్న రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు మెయిల్ సమాచారం అందిందన్నారు. ఏప్రిల్‌లో రెగ్యులర్ ట్రాన్స్‌ఫర్‌లు జరగనున్న నేపథ్యంలో అప్పటివరకు కౌన్సిలింగ్ ప్రక్రియను ఆపాలని కోరారు. ఏడాది మధ్యలో కౌన్సిలింగ్ నిర్వహించడం వల్ల పిల్లల చదువులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అదేవిధంగా జోన్–4లో ఉన్న తమకు ప్రస్తుత కౌన్సిలింగ్ వల్ల సరైన ప్లేస్‌మెంట్స్ లేనందున అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జనరల్ ట్రాన్స్‌ఫర్ వరకు బదిలీలు ఆపేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది సరస్వతి, నాగరత్న, సునీతకుమారి, సూర్యకుమారి, రెడ్డిహేమలత, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో పట్టుబడిన బియ్యం లారీ



గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో బియ్యం లోడ్‌తో నిలబెట్టిన లారీ

రాయచోటి : రాష్ట్రం దాటి వెళ్తున్న బియ్యం లారీని విజిలెన్స్ పోలీసులు అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి అనంతరం జమ్మలమడుగుకు చెందిన విజిలెన్స్ పోలీసులు పీడీఎఫ్ బియ్యం లారీ కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు సమాచారం అందడంతో వెంటాడి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన లారీని గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిలబెట్టి పోలీసులకు తాత్కాలిక సమాచారం ఇచ్చామన్నారు. ఇదే విషయంపై గుర్రంకొండ పోలీసులకు వివరణ కోరగా విజిలెన్స్ పోలీసులు పట్టుకొని ఇక్కడ నిలబెట్టి వెళ్లారని, తమకు పూర్తి సమాచారం తెలియదని చెబుతున్నారు. విజిలెన్స్ పోలీసులు పట్టుకున్న లారీలో పీడీఎఫ్ బియ్యమా లేక అన్ని అనుమతులతో వెళుతున్న బియ్యమా అన్నది తేల్చాల్సి ఉంది.

తెలుగు వారి సంస్కృతి సంక్రాంతి

కురబలకోట : సంక్రాంతి పండగ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కళాశాలలో శుక్రవారం పెద్ద ఎత్తున ముందస్తు సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు వేశారు. సంప్రదాయ వస్త్ర దారణలతో కనువిందు చేశారు. బోగి మంటలు వేసి కోలాటం వేశారు. డ్యాన్సులు, గాలిపటాలు ఎగురవేయడం అలరించాయి. ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

దళిత గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు : దళిత గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ బీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాల్లో మౌలిక వసతులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. దళిత నాయకులు మాట్లాడుతూ పీలేరు పట్టణంలో అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులోల ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌లు సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశానికి హాజరైన దళిత నాయకులకు కూర్చోడానికి స్థలం లేకపోవడంతో కొందరు కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఈవో గురుమోహన్, నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవిందనామ స్మరణ

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వార దర్శనంతో పులకించిన భక్తజనం
- ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ



మదనపల్లె: ప్రసన్న వెంకటరమణస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే



శ్రీకనుగొండరాయ స్వామి ఆలయంలో..



బి.కొత్తకోట: విశేషాలంకరణలో చెన్నకేశవస్వామి



పీలేరు : కోటపల్లెలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బి.కొత్తకోట: వైకుంఠ ద్వార దర్శనం కోసం క్యూలో భక్తులు



రామసముద్రం : శ్రీలక్ష్మీ జనార్దనస్వామి



కలకడ : గోపాపురంలో పుష్పపల్లకీలో బాబా ఊరేగింపు



పీలేరు : ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

మదనపల్లె : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. పుష్ప, విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని అలంకరించారు. గురువారం అర్ధరాత్రి తర్వాత ఆలయ అర్చకులు గోవర్ధన్ భట్టార్ గోపూజ తర్వాత తిరుప్పావై పాశురాలతో ఆలయంలోని వైకుంఠద్వారాలు తెరిచారు. వైకుంఠద్వారం వద్ద పూజలు, హారతి సమర్పించి తోమాలపటంతో ప్రదక్షణగా గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టుకు పుష్పసమర్పణ చేశారు. తర్వాత ధనుర్మాస ప్రత్యేక కైంకర్యాలు, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. శుక్రవారం వేకువజామున అభిషేకం, అలంకారం, తోమాల, అర్చన, నైవేద్యం నిర్వహించి భక్తులకు శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దర్శనభాగ్యం కల్పించారు. ఉదయాన్నే స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం గుండా దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. గోవింద నామస్మరణలతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకటరమణస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఎస్.ఏ.మస్తాన్, గంగారపు నవీన్‌చౌదరి, శ్రీరామ వినోద్, నాగమణి, కోటవారిపల్లె రాజ, బాలుస్వామి, బాలమాలిశేఖర్, జేసీబీ.వేణు పాల్గొన్నారు.

భక్తిలతో ఆలయకాలు కిటకిట

పీలేరు : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలో పలు ఆలయాలు భక్తులతో గోవిందనామ స్మరణతో మార్మోగాయి. ప్రధానంగా శుక్రవారం తెల్లవారిజామున 5 గంటల నుంచి కోటపల్లెలోని శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. అలాగే స్థానిక కడప మార్గంలోని వెంకటాద్రిక్ష సమీపంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. భక్తులకు అన్నపూర్ణ క్యాటరింగ్ అధినేత చలపతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, స్థానిక మదనపల్లె మార్గంలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటపల్లె ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, కడప మార్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పండుగ సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉత్తర ద్వారం వైపు స్వామివారిని కొలువుదీర్చారు. భక్తుల క్యూ కూడా ఆలయానికి దక్షిణంవైపు నుంచి ఉత్తరద్వారం వైపు భక్తులు ఆలయంలో ప్రవేశించేటట్లుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. గోవిందా గోవిందా అంటూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారు. తరిగొండలో లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుర్రంకొండలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని భక్తులు దర్శించుకొన్నారు. మండలంలోని శ్రీ మహావిష్ణువు ఆలయాన్ని భక్తుల సందడితో కిటకిటలాడాయి.

వైభవంగా గీతాపారాయణం

మండల కేంద్రమైన గుర్రంకొండలో గీతా పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వైకుత ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని శ్రీ కృష్ణమందిరంలో గీతా పారాయణ కార్యక్రమంలో భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలను ఉదయం నుంచి సాయంకాలం వరకు ఆలపించారు. గీతాపారాయణ ముగిసిన అనంతరం ఆలయంలో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

ములకలచెరువు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ కనుగొండరాయ స్వామి ఆలయం, బిల్లూవారిపల్లె శ్రీ రామాలయం, బురకాయలకోట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పెద్దమండ్యం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పాపేపల్లెలో కుషావతి నది ఒడ్డున ఏకశిలాగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్త ద్వారం ద్వారా భక్తులకు ప్రవేశం కల్పించారు. ఆలయంలో ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్దమండ్యంలో వెలసిన కోదండరామాలయం, చెరువుకిందపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వెలిగల్లు ఆంజనేయస్వామి ఆలయం, తాటిమాకులపల్లె శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలకు ప్రత్యేక అలంకరణ చేశారు.

కనుల పండువగా ముక్కోటి ఏకాదశి

పెద్దతిప్పసముద్రం : ముక్కోటి ఏకాదశి పర్వదినానికి మండలంలోని అన్ని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువ జామున నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. వైకుంఠ ఏకాదశి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఆలయాల్లో గోవింద నామస్మరణ

బి.కొత్తకోట : మండలంలోని వైష్ణవాలయాలు గోవిందా నామస్మరణతో మార్మోగాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక పురాతన చెన్నకేశ్వస్వామిని దర్శించుకోవడం కోసం భక్తులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ఆలయం చేరుకున్నారు. వీరికోసం క్యూలైన్లు ఏర్పాటు చేయగా భక్తులు వైకుంఠ ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకున్నారు. బీసీకాలనీలోని వెంకటే శ్వరస్వామి ఆలయ వైకుంఠ ద్వారం నుంచి భక్తులు స్వామి దర్శించుకున్నారు. మండలంలోని గట్టులో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో టీటీడీ వైకుంఠ దర్శన ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

కలకడ : భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలను భక్తులు నిర్వహించారు. శుక్రవారం వైకుంట ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం శ్రీసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో స్వామివారిని గ్రామపురవీధులలో ఊరేగించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూర్యోదయంకు మునుపే శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీలక్ష్మీ జనార్ధనస్వామికి ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టార్, కులశేఖర్‌భట్టార్ సుప్రభాత సేవతో మేలుకొలిపి వేదమంత్రాలతో అభిషేకాలు చేసి బెంగళూరు నుంచి తెప్పించిన పుష్పాలతో అలంకరణ చేసి ఊంజల్‌సేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని ఉత్తరద్వారంలో కొలువుతీర్చారు. అలాగే కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూ ఏర్పాట్లు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి ప్రసాదాలు అందజేశారు. అలాగే చెంబకూరులోని శ్రీగట్టు వెంకటరమణస్వామి, మినికిలోని కల్యాణవెంకటరమణస్వామి, కేసీ.పల్లెలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

తంబళ్లపల్లి : మండలంలోని కోసువారిపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు ఉదయం నుండే వైకుంఠ ద్వారాన్ని ప్రారంభించారు. భక్తులకు స్వామి వారి దర్సనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందుజేశారు. పాపహరణం జరుగుతుందన్న భావనతో వేలాది మంది భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా వెళ్లి స్వామివారిని దర్సించుకున్నారు. గ్రామస్థుల ఆర్థిక సహకారంతో అన్న సంతర్పణ నిర్వహించారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారయ్యారు. కళాశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులు వేశారు. భోగిమంటలు వేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ విశిష్ఠత గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కలికిరి : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, చక్కెరవాండ్లపల్లిలో వెలసిన ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయం, గుండ్లూరులో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం, పలు గ్రామాల్లో వెలసిన రామాలయాల్లోనూ నిర్వాహకులు వైకుంఠద్వార దర్శనం ఏర్పాటు చేశారు. చక్కెరవాండ్లపల్లిలో ఉదయం మూల విగ్రహానికి అభిషేకం, అనంతరం వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు.



గుర్రంకొండ : తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



శ్రీకృష్ణ మందిరంలో గీతాపారాయణం



తంబళ్లపల్లె: కోసువారిపల్లెలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



కలికిరి: ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఎంపీడీఓ వర్సెస్ సీడీపీఓ

- మండల మీట్‌కు హాజరయ్యే విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం
- ఇకపై మీకు నోటీసు ఇస్తేనే రావాలని ఎంపీడీఓ ఆదేశం



మండల మీట్‌లో వాగ్వాదం చేసుకొంటున్న ఎంపీడీఓ సీడీపీఓలు

గుర్రంకొండ : గుర్రంకొండ మండల మీట్ ఎంపీడీఓ వర్సెస్ సీడీపీఓగా మారింది. మండల మీట్‌కు సీడీపీఓ హాజరయ్యే విషయమై వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. ఇకపై మీకు మండలమీట్‌కు రావాలంటూ నోటీసులు ఇస్తేనే రావాలని ఎంపీడీఓ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల తోపాటు వాల్మీకిపురం సీడీపీఓ భారతి మండలమీట్‌కు హాజరయ్యారు. ఇది గమనించిన ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఇది మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మాత్రమే నిర్వహించే మండల సర్వసభ్య సమావేశమన్నారు. ఇందులో మండల స్థాయి కంటే ఎక్కువ స్థాయి కలిగిన ఉన్నతాధికారులు హాజరు కాకుడందంటూ పేర్కొన్నారు. తాను మూడు మండలాల సూపర్‌వైజర్లకు ఉన్నతాధికారి అని, తాము తన పరిధిలో ఉన్న మూడు మండలలాల్లో ఎక్కడైనా మండలమీట్‌కు హాజరవ్వొచ్చని సీడీపీఓ అన్నారు. ఆవసరం లేదని మండలం స్థాయి సమాచారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చెబితే మండలమీట్‌లో సరిపోతుందని మీరు రావనవసరం లేదని ఎంపీడీఓ అన్నారు. ఇకపై మండల మీట్‌కు రావాలంటూ మీకు నోటీసు ఇస్తేనే మీరు రావాలని లేక పోతే అవసరంలేదన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖలపై ప్రస్తుతం ఉన్న సమాచారాన్ని సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ సరస్వతి, సర్పంచ్ రౌనఖ్‌భాషా, ఎంపీటీసీలు గంగులమ్మ, సరస్వతి, యాకూబ్, ట్రాన్స్‌కో ఎఈ మౌసీన్, పంచాయతీ ఈఓ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో విద్యార్థికి తీవ్ర గాయాలు



గాయపడిన విద్యార్థి

తంబళ్లపల్లె : కరెంటు షాక్ కొట్టడంతో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన ముద్దలదొడ్డి వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు చోచేసుకుంది. ఘటనపై తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు... ములకలచెరువు మండలం, దేవల చెరువు పంచాయతీకు చెందిన ధనంజయ రెడ్డి (19) తంబళ్లపల్లె మండలం బలకవారిపల్లెలో ఉన్న తాత సత్తిరెడ్డి ఇంటి దగ్గర ఉంటూ ఇక్కడే ఐటీఐ చదువుతున్నాడు. తాత సత్తిరెడ్డితో కలసి పేలవారిపెంట నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో బలకవారిపల్లె తరలిస్తుండగా మార్గమధ్యంలోని ముద్దులదొడ్డి వద్ద విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌కు తగలకుండా ఎత్తే సమయంలో ధనంజయ రెడ్డి చేతికి విద్యుత్ వైరు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని 108 లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

జాతీయస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

నిమ్మనపల్లె : జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నిమ్మనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినిలు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కే.సత్యనారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం డిసెంబర్‌లో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో నిమ్మనపల్లె మోడల్ స్కూల్ నుంచి సీనియర్ విభాగంలో ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే.భవ్య శ్రీ, కె.సంధ్యలు ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో నిలిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వీరు ఈనెల 17,18,19, తేదీలలో ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థినులను, అందుకు కృషి చేస్తున్న పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మణికుమార్ ను ప్రిన్సిపల్ కె ఎస్ ఎన్ మూర్తి, పాఠశాల ఉపాధ్యాయ బందం అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, పోటీలకు వెళ్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం

'తల్లికి వందనం' అమలు చేయాలని నిరసన

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలి
- సబ్ కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆందోళన



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మదనపల్లె : ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కూటమి ప్రభుత్వం, తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టరేట్ ఎదుట రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3,850 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ...ఎలాంటి షరతులు లేకుండా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలుచేస్తామని ఎన్నికల ముందు తల్లిదండ్రులకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడునెలలు కావస్తున్నా ఇప్పటివరకు పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులను మోసంచేసేలా ఈ విద్యాసంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయలేమని ప్రకటించడం సరైనది కాదన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,850 కోట్లు విడుదల చేయకపోవడం వల్ల కాలేజీలు ఫీజులు చెల్లించాల్సిందిగా విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని, తక్షణమే విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బిసెంట్ థియోసఫికల్ దివ్యజ్ఞాన కళాశాలను అధికారంలోకి రాగానే యూనివర్శిటీగా మారుస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతోపాటుగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు జిల్లా ఊసే ఎత్తడం లేదన్నారు. అనంతరం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు వినతిపత్రం సమర్పించారు.

పాడిరైతుల సంక్షేమానికి గోకులం షెడ్లు

మదనపల్లె : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధికి మినీ గోకులం షెడ్లను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ మందబండలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతు ఎం.వెంకటరమణ రూ.2లక్షల30వేల వ్యయంతో నిర్మించిన మినీ గోకులం(పశువుల షెడ్డును) ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పశుపోషకులకు చేయూత అందించేందుకు, పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలను ప్రారంభించిందన్నారు. కూటమిప్రభుత్వం పాడిపరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టి మినీ గోకులాల నిర్మాణాలకు పచ్చ జెండా ఊపడమే కాకుండా, పశుపోషకులకు 90శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70శాతం రాయితీ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నందకుమార్, రఘుపతినాయుడు, సునీల్, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏపీడీ మధుబాబు, ఏపీఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.